సుష్మాస్వరాజ్‌కు ఘన నివాళి



సుష్మా స్వరాజ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

జగద్గిరిగుట్ట: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కేంద్ర మాజీ మంత్రి, స్వర్గీయ సుష్మా స్వరాజ్ కీలకంగా వ్యవహరించారని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ బీజేపీ అసెంబ్లీ కార్యాలయంలో నియోజకవర్గ కన్వీనర్ జేకే శేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆహ్వానం అందజేత

నిజాంపేట్: బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలోని నడిగడ్డ నాగుల ఎల్లమ్మ ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం కాంగ్రెస్ సీనియర్ నేత కొలన్ శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అమ్మవారి నూతన విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి రావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, కామేష్, బాబి, యోగి, కృష్ణ, రఘు, హరిబాబు ఉన్నారు.

కూల్చివేతలు.. మిన్నంటిన రోదనలు

- పోలీసుల భారీ బందోబస్తు
- 20 నిమిషాల్లో 51 నిర్మాణాలు నేలమట్టం
- జేసీబీలకు అడ్డుగా నిలిచిన నివాసితులు



సర్వే నెంబరు 329/1లో జేసీబీతో ఇళ్లను కూల్చివేస్తు..



కూల్చివేతల వద్ద భారీగా చేరిన జనం



ఇల్లు కూల్చొద్దని దండం పెడుతున్న వృద్ధురాలు

సుభాష్‌నగర్: అప్పటివరకు అక్కడ నిశబ్ద వాతావరణం. ఒక్కసారిగా రోదనలు మిన్నంటాయి. రోజువారీగా ఆ బస్తీలో ఎవరి పనుల్లో వారు నిమగ్నమయ్యారు. ఒక్కసారిగా పోలీసులు, అధికారులు జేసీబీలతో ఆ బస్తీపై విరుచుకుపడ్డారు. ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి. తమ ఇళ్లపై జేసీబీని ఎక్కు పెట్టడంతో స్థానికులు పెద్ద ఎత్తున పోగై తమ నివాసాలను కూల్చవద్దంటూ అడ్డుకున్నారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి వారిని పక్కకు జరిపే సమయంలో మాట మాట పెరిగి ఉద్రిక్తతకు దారితీసింది. ఎట్టకేలకు అధికారులు తమ ఆపరేషన్ విజయవంతం చేసి వెళ్లిపోయారు.

51 నిర్మాణాలు నేలమట్టం

చెరువు పరిసర ప్రాంతాల్లో వెలిసిన నిర్మాణాలపై హైడ్రా పంజా విసిరింది. ఎవ్వరూ ఊహించని రీతిలో అకస్మాత్తుగా భారీ పోలీస్ బందోబస్తు మధ్య 20 నిమిషాల్లో 51 నిర్మాణాలను నేలమట్టం చేసింది. గాజుల రామారం డివిజన్ దేవేందర్ నగర్‌లోని చింతల చెరువును ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 329/1లో వెలిసిన నిర్మాణాలను హైడ్రా ధికారులు మంగళవారం కూల్చివేశారు. హైడ్రా అధికారి పాపారావు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి భాస్కరరావు నేతృత్వంలో ఈ కూల్చివేతల ఆపరేషన్ కొనసాగించారు. ప్లాట్లు కొని ప్రస్తుతం నివాసాలు ఏర్పాటు చేసుకుని అందులో ఉన్నవారు తమ ఇళ్లను కూల్చి వేయవద్దంటూ కాళ్ల, వేళ్ల మీద పడినా అధికారులు తమ పని పూర్తి చేశారు.

భారీ బందోబస్తు మధ్య

కూల్చివేతలకు ముందు మేడ్చల్, పేట్ బషీరాబాద్ ఏసీపీల పరిధిలోని సిబ్బంది, డీఆర్ఎస్ బందం, మార్షల్, స్పెషల్ పోలీస్ ప్రొడక్షన్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. కూల్చివేతలను మహిళలు అడ్డుకోవడంతో కాసేపు ఆగారు. మహిళా పోలీసులను రంగంలోకి దింపి అడ్డుకున్న మహిళలను స్టేషన్ కు తరలించారు. సంఘటన స్థలాన్ని మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, పేట్‌బషీరాబాద్ ఏసీపీ హనుమంతరావులు పర్యవేక్షించారు.



జేసీబీకి అడ్డుగా నిలిచిన ఇళ్ల వాసులు

మిన్నంటిన రోదనలు

కూలుస్తున్న సమయంలో తమ ఇళ్లను కూల్చవద్దని అధికారులను వేడుకున్నారు. నగరానికి వలస వచ్చి, కూలీనాలి చేసి, పైసా పైసా కూడబెట్టి ఇళ్లను కట్టుకున్నామని, కూల్చితే తాము ఎక్కడికి వెళ్లలేమని రోదించడం పలువురుని కలిచి వేసింది.

కబ్జాదారులు పరార్

నిర్మాణాలను కూలుస్తున్న సమయంలో కబ్జాదారులు అక్కడ నుంచి పరార్ అయ్యారు. ప్లాట్లు కొన్నవారే అధికారులతో వాగ్వాదానికి దిగారు. చివరకు చేసేది ఏమీ లేక అధికారులకు శాపనార్థాలు పెట్టారు. ఇక మమ్మల్ని ఏ దేవుడు రక్షిస్తాడని కన్నీరు మున్నీరయ్యారు.

సీపీఎం ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ



కుత్బుల్లాపూర్: పాలిస్తీనపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను నిరసిస్తూ మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. షాపూర్ నగర్ రైతు బజార్ నుంచి సాగర్ హోటల్ చౌరస్తా వరకు జరిగిన శాంతి ర్యాలీలో సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ మాట్లాడారు. ప్రపంచ దేశాలు కలిసి ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను ఆపేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్, సత్యం, దేవదానం, అంజయ్య, కరుణాకర్, మల్లారెడ్డి, పాషా, దుర్గా నాయక్, శ్రీశైలం, యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేసిన హెచ్‌ఎంటీ ఉద్యోగులు



మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న హెచ్‌ఎంటీ యూనియన్ నాయకులు

కుత్బుల్లాపూర్: దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌కు హెచ్‌ఎంటీ ఉద్యోగులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్, అంజయ్య, కుమార్, మోహన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీహరి, ప్రకాష్, రాజశేఖర్, వెంకట నారాయణ, మధు, సుబ్రహ్మణ్యం, రాంబాబు తదితరులు ఉన్నారు.

సీఐ ఉపేందర్‌కు మెరిటోరియస్ సర్టిఫికెట్



సీఐ ఉపేందర్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న డీజీపీ రవిగుప్తా

నిజాంపేట్: కీలక కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చేసి బాధితులకు న్యాయం చేసిన బాచుపల్లి సీఐ ఉపేందర్‌కు మంగళవారం రాష్ట్ర డీజీపీ రవిగుప్తా మెరిటోరియస్ సర్టిఫికెట్‌ను అందజేశారు. బాచుపల్లి పీఎస్ పరిధిలో రెండు హత్య కేసుల్లో నిందితులకు జీవిత ఖైదుతో పాటు మరో రెండు కేసుల్లో పదేళ్ల శిక్ష పడేలా ఉపేందర్ దర్యాప్తు చేపట్టారు. మంగళవారం డీజీపీ కార్యాలయంలో జరిగిన క్రిమినల్ కేసుల రివ్యూ మీటింగ్‌లో ఉపేందర్ సేవలను ప్రశంసిస్తూ సర్టిఫికెట్‌ను అందజేశారు.

గంటన్నరలో బాలిక ఆచూకీ కనుగొన్నారు



బాలికను తండ్రికి అప్పగిస్తున్న పోలీసులు

జీడిమెట్ల: రోడ్డుపై తప్పిపోయిన బాలికను జీడిమెట్ల పోలీసులు గంటన్నర వ్యవధిలో ఆచూకీ కనుక్కొని తల్లిదండ్రులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ వివరాల ప్రకారం.. చింతల్‌కు చెందిన ఎంకే ఖాన్ భార్య కుమార్తె మహేరా ఖాన్(5)ను తీసుకుని షాపింగ్‌కు వచ్చింది. తల్లి వెనకాల నడుస్తున్న పాప కొద్దిసేపటి తర్వాత తల్లి వెనక్కి తిరిగి చూడగా.. బాలిక కనిపించలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ చొరవ తీసుకుని పెట్రోలింగ్ సిబ్బందిని అలర్ట్ చేశారు. సీసీ ఫుటేజీల ఆధారంగా బాలిక మాంగళ్య షాపింగ్ మాల్ వెనకాల దొరికింది. వెంటనే స్టేషన్‌కు తీసుకువచ్చి పాపను తల్లిదండ్రులకు అప్పగించారు.

మట్టి గణపతుల ప్రతిమలను ప్రతిష్ఠించాలి

సుభాష్‌నగర్: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతుల ప్రతిమలను ప్రతిష్ఠించాలని సూరారం కాలనీ భవానీనగర్‌కు చెందిన శ్రీవినాయక యువజన సంఘం అధ్యక్షుడు శీలం వీరేందర్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈ నెల 8వ తేదీన ఉదయం 9 గంటలకు కర్రపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, భక్తులు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



విద్యార్థులతో ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు

కుత్బుల్లాపూర్: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం కొంపల్లిలోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో సుచిత్ర, కొంపల్లి శాఖల విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు టీవీలు, మొబైల్ గేమ్స్‌కు దూరంగా ఉండాలని, ఆటలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నరిశెట్టి సరిత, కరస్పాంటెండెంట్లు రవికుమార్, వరప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



దుండిగల్: ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడంపై రెవెన్యూ అధికారులు కన్నెర్ర చేశారు. దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేటలోని సర్వే నెంబరు 170/6లో ఓ నిర్మాణ సంస్థ నిర్మాణాలను చేపడుతుంది. విషయం తెలుసుకున్న గండిమైసమ్మ–దుండిగల్ తహసీల్దార్ మతిన్ పోలీస్ బందోబస్తుతో మంగళవారం కూల్చివేతలు చేపట్టారు. పిల్లర్ల దశలో ఉన్న నిర్మాణాలను జేసీబీతో కూల్చి వేయించారు. మరోమారు నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠ



పూజలో పాల్గొన్న కార్పొరేటర్ జగన్

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని పాలాల బస్తీ, మగ్దూం నగర్‌లో మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. గణపతి పూజ, మహా గౌరీ పూజ, విగ్రహ గ్రామోత్సవం, మంగళ హారతి, మంత్ర పూజ తదితర పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ జగన్ హాజరై పూజలో పాల్గొన్నారు. బుధ, గురు వారాల్లో పూజలు, అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

వయనాడ్ బాధితులను ఆదుకోవాలి



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

నిజాంపేట్: ప్రకృతి వైపరీత్యంతో సర్వం కోల్పోయిన కేరళలోని వయనాడ్ ప్రజలను మానవతా దృక్పథంతో ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి వెంకటరామయ్య కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం బాచుపల్లి మండల సీపీఎం నాయకులు ప్రగతినగర్‌లో విరాళాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో ఎం చంద్రశేఖర్, బాల వెంకటేశ్వరరావు, బాలపీరు, ప్రవీణ్, మధు, మల్లికార్జున్, రాజు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలను క్రమం తప్పకుండా ఇవ్వాలి



సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

దుండిగల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నామని ఐసీడీఎస్ సీడీపీఓ శారద అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా దుండిగల్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి మూడేళ్ల పాటు తల్లి పాలను క్రమం తప్పకుండా ఇవ్వాలని సూచించారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్న ప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, కౌన్సిలర్లు జక్కుల కృష్ణాయాదవ్, విజయలక్ష్మి, గోపాల్‌రెడ్డి, సూపర్‌వైజర్ శోభారాణి, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో స్నేహితుల మధ్య గొడవ

- ఇద్దరి మధ్య నచ్చజెప్పేందుకు యత్నించిన స్నేహితుడి గొంతుపై బీరుతో పొడిచిన వైనం
- ఆసుపత్రికి తరలింపు



గాయపడిన సయ్యద్ గౌస్

దుండిగల్: అప్పటి వరకు ముగ్గురు స్నేహితులు పీకల దాకా తాగారు. తాగిన మైకంలో ఇద్దరు మిత్రులు గొడవ పడుతుండటంతో నచ్చజెప్పేందుకు మధ్యలో వచ్చిన మరో స్నేహితుడిని బీరు సీసాతో గొంతులో పొడిచాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. చర్చి గాగిల్లాపూర్ ప్రాంతానికి చెందిన సాయికుమార్, మధుసూదన్, సయ్యద్ గౌస్(25)లు స్నేహితులు. ఈ నెల 5వ తేదీన రాత్రి వీరు ముగ్గురు గాగిల్లాపూర్‌లోని స్వప్న వైన్స్‌లో మద్యం తాగారు. ఈ క్రమంలో సాయికుమార్, మధుసూదన్ మధ్య మాటా మాటా పెరిగి గొడవ జరిగింది. దీంతో మధుసూదన్ సాయికుమార్‌పై దాడి చేసేందుకు ప్రయత్నిస్తుండగా.. గౌస్ మధ్యలో అడ్డుకుని నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. అప్పటికే కోపంతో ఊగిపోతున్న మధుసూదన్ బీరు బాటిల్‌ను పగలగొట్టి గౌస్ గొంతులో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన గౌస్‌ను స్థానికులు సూరారంలోని మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. బాధితుడి సోదరుడు అమీర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మధుసూదన్, సాయికుమార్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

గొడవపడి వెళ్లిపోయిన భార్య.. భర్త ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: కుటుంబ కలహాలతో భార్య ఇంటి నుంచి వెళ్లి పోవడంతో మనస్తాపానికి గురైన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు ప్రాంతానికి చెందిన చక్రి వంశీవర్మ(28) బతుకుదెరువు కోసం వలసవచ్చి కుత్బుల్లాపూర్‌లోని వాజ్‌పేయినగర్‌లో నివసిస్తూ ఓ కంపెనీలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో కోపగించిన భార్య ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో మనస్థాపానికి గురైన వంశీవర్మ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

బలహీన వర్గాల గళం గద్దర్

జగద్గిరిగుట్ట: బడుగు, బలహీన వర్గాల గళం గద్దర్ అని తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ అన్నారు. ప్రజాయుద్ధనౌక గద్దర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ప్రజానాట్యమండలి నియోజకవర్గ అధ్యక్షులు వీరబాబు అధ్యక్షతన మంగళవారం గద్దర్ సంస్మరణ సభ నిర్వహించారు. సీపీఐ సహాయ కార్యదర్శి కత్తుల దుర్గయ్యతో కలిసి గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గద్దర్ ఆశయాలను ఆచరణలో పెట్టడానికి ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జగద్గిరిగుట్ట శాఖ కార్యదర్శి సహదేవ్ రెడ్డి, ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు దుదిగే రాములు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వంగాల శ్రీనివాస్, ప్రజానాట్యమండలి మండల ఇన్‌చార్జి పుజ్జిని హరినాథ్ రావు, సభ్యులు, అభిమానులు నర్సాగౌడ్, నాగేష్ చారి, శివారెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాసరెడ్డి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్



సమావేశం అనంతరం పారిశ్రామికవేత్తలతో విద్యుత్ అధికారులు


జీడిమెట్ల: పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా విద్యుత్‌శాఖ ఎస్.ఈ శ్రీరాంమోహన్ అన్నారు. మంగళవారం జీడిమెట్లలోని పరిశ్రమల అసోసియేషన్ కార్యాలయంలో పారిశ్రామికవేత్తలతో విద్యుత్ వినియోగానికి సంబంధించిన విషయాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశ్రామికవాడలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులుంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం జీడిమెట్ల డీఈ విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్‌కు సంబంధించిన అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్ రెడ్డి, సాయికుమార్, దుర్గయ్య, సదాశివారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

కుక్కకాటుతో ఇద్దరికి గాయాలు

మోతీనగర్: కుక్క కాటుతో ఇద్దరికీ గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం అల్లాపూర్ డివిజన్‌లో చోటు చేసుకుంది. అల్లాపూర్ డివిజన్ వి. రామారావు నగర్ ఎండీ జలీల్ కుమారుడు నిషా (2) సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వస్తుండగా వీధిలో వెళుతున్న కుక్క మెడను అందుకోవడంతో స్థానికులు వెంటనే దానిపై దాడి చేయడానికి ప్రయత్నించగా పారిపోయింది. అదే విధంగా రాజు అనే యువకుడు ఇంటి నుంచి బయటకు వస్తుండగా అతని పిక్క పట్టి లాగడంతో ఆందోళనకు గురయ్యాడు. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

‘స్వచ్ఛదనం– పచ్చదనం’లో భాగస్వాములవ్వాలి

జిల్లా కలెక్టర్ గౌతం



కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ గౌతం, మున్సిపల్ చైర్మన్ శ్రీశైలంయాదవ్ తదితరులు

కుత్బుల్లాపూర్: స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములవ్వాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం అన్నారు. మంగళవారం కొంపల్లి మున్సిపల్ పరిధిలోని రాయల్ పార్కులో మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. అధికారులు ఆయా వార్డుల్లో తాగు నీటి సరఫరా ట్యాంక్‌లను శుభ్రపర్చి క్లోరినేషన్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పార్కులను అభివృద్ధి చేయడంతో పాటు చిన్నారుల ఆట స్థలాలను నిర్మించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, స్పెషల్ ఆఫీసర్ వెంకటేశం, వైస్ చైర్మన్ గంగయ్యానాయక్, మేనేజర్ వెంకటేశం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జానీ, కౌన్సిలర్లు, ఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలి


కుత్బుల్లాపూర్: స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రెండో రోజు మంగళవారం ఎంటమాలజీ సిబ్బంది దోమల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. కుత్బుల్లాపూర్ వేణుగోపాల స్వామి ఆలయ సమీపంలో ఇంటి పరిసర ప్రాంతాల్లో ఎక్కడ కూడా నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని సూచించారు. నీటిలోనే దోమలు పెరిగి డెంగీ వంటి విష జ్వరాలు వ్యాప్తి చెందుతాయని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ నరసింహ, ఏఎంఓహెచ్ భార్గవ నారాయణ, సూపరింటెండెంట్ మంజులత, ఎంటమాలజీ ఏఈ ఉమారాణి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

⊙ సుభాష్‌నగర్ డివిజన్ శివాలయ నగర్‌లో కార్పొరేటర్ హేమలత సురేష్‌రెడ్డి మొక్కలు నాటారు. స్థానిక సంక్షేమ సంఘం నేతలతో కలిసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ కృష్ణ, మున్సిపల్ డాక్టర్ భార్గవ్, వివిధ శాఖల అధికారులు, డివిజన్ మహిళా ప్రధాన కార్యదర్శి మంగ, సత్యవాణి, డివిజన్ యూత్ అధ్యక్షులు జహంగీర్, విజయ్, ప్రభాకర్, శివాగౌడ్ పాల్గొన్నారు.

ప్రొ.జయశంకర్ పాత్ర మరువలేం



జయశంకర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కొలుకుల జగన్

జగద్గిరిగుట్ట: తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ పాత్ర మరువలేనిదని కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. మంగళవారం జయశంకర్ సార్ జయంతి సందర్భంగా డివిజన్ పరిధిలోని అవుట్ పోస్ట్ చౌరస్తా వద్ద గల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో జయశంకర్ సార్ పాత్ర ఎంతో కీలకమైనదని వివరించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, విశ్వకర్మ సంఘం మండల అధ్యక్షులు బాల బ్రహ్మాచారి, శ్రీనివాస్ చారి, బిక్షపతి, హనుమాన్ చారి, శ్రీనివాస్ చారి, ప్రవీణ్ చారి పాల్గొన్నారు.




ఢిల్లీలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్



కొంపల్లి పురపాలక సంఘం కార్యాలయంలో నివాళులర్పిస్తున్న చైర్మన్ శ్రీశైలం యాదవ్

ప్రతి దరఖాస్తుదారుడికి లబ్ధి



చెక్కులను అందజేస్తున్న బండి రమేష్, వెంకటేశ్వరరావు

బాలానగర్: ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రతి దరఖాస్తుదారుడికి లబ్ధి చేకూరుతుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని 50 మంది లబ్ధిదారులకు బాలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో రూ.45 లక్షలకు పైగా విలువ కలిగిన చెక్కులను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావుతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా సీఎంఆర్‌ఎఫ్ ద్వారా నిధులు మంజూరు చేయటం అభినందనీయమన్నారు.